సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



ఎడాపెడా చలాన్లు!

కొత్తగూడెంలో వాహనదారులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. చలాన్ల మోతతో బెంబేలెత్తుతున్నారు.

8లో



సింగరేణి గనుల్లో ఢిల్లీ బృందం

సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, మణుగూరులోని సింగరేణి గనులను న్యూఢిల్లీకి చెందిన అధికారులు సందర్శించారు.

10లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పెద్దమ్మతల్లికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీ కుమారి, అర్చకులు, వేద పండితులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు పాల్గొన్నారు.

ఆధారాలతో పరిశీలన చేయించుకోవాలి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ, అధికారులు

కొత్తగూడెంఅర్బన్: పదోన్నతుల జాబితాకు సంబంధించి అభ్యంతరాలుంటే తగు ఆధారాలతో పరిశీలన చేయించుకోవాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న 2,959 మంది ఉపాధ్యాయుల దరఖాస్తులను గురువారం ఆయన ఆన్‌లైన్‌లో ధ్రువీకరించారు. పదోన్నతుల జాబితాలో అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు సబ్జెక్టుల, కేడర్ వారీగా నిర్ణీత ఫార్మాట్‌లో (33 కాలమ్స్) వివరాలు నింపి, పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా 11 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎస్.సతీష్ కుమార్, ఎస్‌కే సైదులు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్ కుమార్, నాగలక్ష్మి, వేణుగోపాలరావు, సుజాత, రాము తదితరులు డీఈఓ వెంకటేశ్వరాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద



కిన్నెరసాని నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

పాల్వంచరూరల్/చర్ల : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి గురువారం ఎగువనుంచి 5వేల క్యూసెక్కుల నీరు రావడంతో నీటిమట్టం 405 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేటు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ సురేష్ తెలిపారు. ఇక తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో 6 గేట్లు ఎత్తి 4,123 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం 73.30 మీటర్లుగా నీటి మట్టాన్ని కొనసాగిస్తున్నారు.

పాత మండల కమిటీలే కొనసాగుతాయి..

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య



భద్రాచలం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు జిల్లాలో ఉన్న పూర్వ మండల కాంగ్రెస్ కమిటీలే కొనసాగుతాయని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని, గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పూర్వ మండల కమిటీల జాబితాను ఆయన విడుదల చేశారు.

గూడెం.. కీలకం



భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వే స్టేషన్

రైల్వే వారధిగా భద్రాచలం రోడ్ స్టేషన్

- కొత్తగా మూడు లైన్లకు ఫైనల్ సర్వే
- మారనున్న మణుగూరు రూపురేఖలు
- కొత్తగూడెంలో లోకో షెడ్ ఏర్పాటుకు ఆస్కారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వేకు 15 శాతం మేర ఆదాయాన్ని అందిస్తున్న భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ భవిష్యత్‌లో మరింత కీలకంగా మారనుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. రైల్వేశాఖ కొత్తగా నిర్మించబోయే రైల్వేలైన్లతో కొత్తగూడెం దశాదిశా మారనుంది.

మూడు మార్గాలకు గ్రీన్ సిగ్నల్..

దశాబ్దాల తరబడి కొత్తగూడెం స్టేషన్‌కు భవిష్యత్ రేఖగా కొవ్వూరు రైల్వే మార్గాన్ని చెప్పుకునేవారు. ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టుకు మోక్షం లభించలేదు. చివరకు భద్రాచలంరోడ్ - సత్తుపల్లి వరకే రైల్వే లైన్ నిర్మించారు. అయితే కొత్తగా భద్రాచలం (పాండురంగాపురం) - మల్కన్‌గిరి, కిరండోల్ - కొత్తగూడెం, మణుగూరు - రామగుండం లైన్ల నిర్మాణానికి రైల్వేశాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఈ మార్గాల నిర్మాణానికి ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్)కు ఆదేశాలు జారీ చేసింది. ఒకసారి సర్వే పూర్తయిన తర్వాత నిధుల కేటాయింపు దశలోకి వెళ్తుంది. ఇంతకాలం సర్వేలకే పరిమితమైన కొత్త రైల్వేలైన్లలో తాజాగా ఎఫ్‌ఎస్‌ఎల్ సర్వే కీలక మలుపుగా చెప్పుకోవచ్చు.

కొత్తగూడెంలో లోకోషెడ్ !

రైళ్లు, గూడ్సుల్లో పని చేసే సిబ్బంది నాలుగు గంటల తర్వాత రైలు, స్టేషన్ మారుతుంటారు. ఉదాహరణకు కొత్తగూడెం రైలులో బయల్దేరిన లోకోపైలట్/గార్డ్/టీసీ/టీటీఈలు కాజీపేటలో దిగిపోతారు. అక్కడి నుంచి మరో పైలట్ సదరు రైలును హైదరాబాద్ లేదా మరే ఇతర గమ్యస్థానానికైనా తీసుకెళ్తాడు. కాజీపేటలో దిగిపోయిన లోకోపైలట్ మరో రైలు/గూడ్సు ద్వారా కాజీపేట నుంచి కొత్తగూడెం చేరుకుంటారు. ప్రస్తుతం కాజీపేట నుంచి భద్రాచలంరోడ్ రైల్వేస్టేషన్ 150 కిలోమీటర్ల దూరంలో ఉంది. మరో కీలకమైన జంక్షన్ విజయవాడ నుంచి 175 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాగా అంతర్రాష్ట్రాల మధ్య నిర్మించబోయే పాండురంగాపురం - మల్కన్‌గిరి (ఒడిశా) మార్గం నిడివి 180 కిలోమీటర్లు. కిరండోల్ - కొత్తగూడెం మార్గం నిడివి కూడా 180 కిలోమీటర్లే. ఇక తెలంగాణ పరిధిలోని మణుగూరు - రామగుండం రైల్వే మార్గం 197 కిలోమీటర్లుగా ఉంది. అంటే కొత్తగూడెం నుంచి నాలుగైదు గంటల పాటు ప్రయాణిస్తే మరో కీలక జంక్షన్ వస్తుంది. దీంతో భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ కేంద్రంగా కొత్త క్రూ పాయింట్లు వస్తాయి. ఫలితంగా విజయవాడ, కాజీపేట తరహాలో రైళ్ల రాకపోకలకు భద్రాచలంరోడ్ రైల్వేస్టేషన్ కీలకంగా మారనుంది. ప్రస్తుతం తెలంగాణలో సికింద్రాబాద్, కాజీపేటల్లోనే లోకోషెడ్లు (రైలు ఇంజన్ల డిపో) ఉన్నాయి. భౌగోళికంగా కొత్తగూడేనికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా రైళ్ల రాకపోకలు మరింత సులువుగా, వేగంగా నడిపేందుకు లోకోషెడ్ నిర్మించే అవకాశం ఉంటుంది.

పెండింగ్‌లో మరో మూడు..

భద్రాచలం రోడ్ మీదుగా సర్వే చేపట్టిన వాటిలో భద్రాచలంరోడ్ - కొవ్వూరు, సత్తుపల్లి - కొవ్వూరు, కొండపల్లి - కొత్తగూడెం రైల్వేలైన్లు ఉన్నాయి. ఈ లైన్లకు సంబంధించి ప్రాథమిక సర్వే పూర్తయి ఏళ్లు దాటినా పురోగతి లేదు. కాగా భద్రాచలంరోడ్ - సత్తుపల్లి మార్గంలో ఉన్న పెనుబల్లి రైల్వే స్టేషన్ నుంచి కొండపల్లి వరకు కొత్త మార్గం నిర్మించాలనే ప్రతిపాదన సైతం రైల్వేశాఖ పరిశీలనలో ఉంది.

జంక్షన్‌గా మణుగూరు..

రైల్వేశాఖ కొత్తగా ప్రకటించిన రైలు మార్గాల్లో మణుగూరు - రామగుండం ఉంది. రామగుండం సమీపంలోని రాఘవాపురం దగ్గర మొదలయ్యే ఈ రైలు మార్గాన్ని మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపూర్, భూపాలపల్లి, రామానుజపురం మీదుగా మణుగూరు వరకు నిర్మిస్తారు. ప్రాథమిక సర్వేలో ఈ మార్గం నిర్మాణం కోసం రూ. 3000 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. మరోవైపు కొత్తగూడెం నుంచి కిరండోల్ వరకు కొత్త రైలుమార్గం నిర్మాణానికి ఫైనల్ సర్వేకు రైల్వే శాఖ శ్రీకారం చుడుతోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ మార్గం హేమచంద్రాపురం రైల్వే గేట్ (కొత్తగూడెం) నుంచి మొదలై మణుగూరు దాటిన తర్వాత కుడి వైపు నుంచి గోదావరి మీదుగా చర్ల మండలానికి చేరుతుంది. అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశించి దంతెవాడ జిల్లాలోని కిరండోల్ అనే మైనింగ్ ఏరియాకు చేరుకుంటుంది. కిరండోల్, రామగుండం రెండు మార్గాలకు జంక్షన్ పాయింట్‌గా మణుగూరును పరిశీలించే అవకాశం ఉంది. ఇదే సమయంలో మణుగూరుకు సమీపంలోని పాండురంగాపురం సైతం జంక్షన్ పాయింట్ అయ్యేందుకు అవకాశం ఉంది.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన పువ్వాడ, మదన్‌లాల్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మదన్‌లాల్, పక్కన మంత్రి పువ్వాడ

ఖమ్మం మయూరిసెంటర్/ వైరా: విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు(కేటీఆర్)ను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ కూడా కేటీఆర్‌ను కలిసి తనకు టికెట్ కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

పార్లమెంటరీ కామర్స్ కమిటీ సభ్యుడిగా 'నామ'



నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: వాణిజ్య శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను సభ్యుడిగా నామినేట్ చేస్తున్నట్లుగా రాజ్య సభ సెక్రటేరియట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, నాగేశ్వరరావును పార్లమెంటరీ కామర్స్ కమిటీ సభ్యుడిగా నియమించడంపై ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలసాని అలక !

- భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశాలకు దూరం
- ఇన్‌చార్జ్ తాతా మధును కలిసేందుకు విముఖత
- అంటీముట్టనట్టుగా ఉంటున్న లక్ష్మీనారాయణ వర్గం
- తుమ్మలతో కలిసి ప్రయాణిస్తారంటూ ఊహాగానాలు



బాలసాని లక్ష్మీనారాయణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడు, మూడుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన బాలసాని లక్ష్మీనారాయణ అలకబూనారు. ప్రస్తుతం భారత రాష్ట్ర సమితిలో కొనసాగుతున్న బాలసాని.. ఇటీవల పార్టీ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా సొంత నియోజకవర్గమైన భద్రాచలం విషయంలో పార్టీ అనుసరిస్తున్న తీరుతో ఆయన కినుక వహించినట్టు సమాచారం.

మీటింగ్‌కు డుమ్మా

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భద్రాచలం స్థానానికి డాక్టర్ తెల్లం వెంకట్రావును బీఆర్‌ఎస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే కొన్ని నెలల క్రితమే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వెంకట్రావు.. టికెట్ల ప్రకటనకు రెండు వారాల ముందు తిరిగి గులాబీ గూటికి చేరి టికెట్ దక్కించుకున్నారు. తెల్లం పార్టీని వీడడంతో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన ఇతర నేతలకు ఈ అంశం మింగుడుపడటం లేదు. దీంతో నిత్యం అసమ్మతిగళం వినిపిస్తూ వస్తున్నారు. దీంతో ఇటీవల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు భద్రాచలంలో ప్రచార కార్యక్రమాన్ని భారీ ఎత్తున ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. అయితే చివరి నిమిషంలో ఈ కార్యక్రమం వాయిదా పడింది. దీంతో నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన నాయకులతో బూర్గంపాడులో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బాలసాని లక్ష్మీనారాయణ హాజరు కాలేదు. అంతేకాక ఆయనకు పట్టున్న వాజేడు, వెంకటాపురం మండలాల నాయకులు కూడా రాలేదు. కేవలం భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం నాయకులతోనే సమావేశాన్ని మమా అనిపించారు.

బాలసానికి ఉక్కపోత

టీడీపీలో ఉన్నప్పటి నుంచి భద్రాచలం నియోజకవర్గంలో బాలసాని లక్ష్మీనారాయణ ప్రముఖ నేతగా ఉంటూ వస్తున్నారు. టీడీపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరినా ఈ నియోజకవర్గంపై తనదైన ముద్ర కొనసాగిస్తూ వచ్చారు. గతేడాది కాలంగా పార్టీ కార్యక్రమాలకు తెల్లం వెంకట్రావు దూరంగా ఉన్న సమయంలోనూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆత్మీయ సమావేశాల నిర్వహణ బాధ్యతలు చూశారు. అయితే రాజకీయ వ్యూహంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ వేగంగా పావులు కదిపి కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావును తిరిగి సొంతగూటికి తీసుకొచ్చింది. ఈ వ్యవహారంలో బాలసానికి పెద్దగా పాత్ర దక్కలేదు. పైగా తెల్లంను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను పార్టీ తాతా మధుకు అప్పగించింది. తన ప్రమేయం లేకుండా నియోజకవర్గంలో చకచకా మార్పులు జరిగిపోతుండడం బాలసానికి ఇబ్బందిగా మారిందని ఆయన అనుచర వర్గాలు అంటున్నాయి.

తుమ్మలతో వెళ్తారా?

బాలసాని లక్ష్మీనారాయణ సుదీర్ఘ కాలం టీడీపీలో కొనసాగారు. మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడిగా భద్రాచలం నియోజకవర్గంలో చక్రం తిప్పారు. తాజాగా కారు గుర్తుపై పాలేరు నుంచి పోటీచేసే అవకాశం దక్కకపోవడంతో తుమ్మల అసంతృప్తితో ఉన్నారు. తమ పార్టీలోకి రమ్మంటూ తుమ్మలను కాంగ్రెస్ తరఫున రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి రాష్ట్ర స్థాయి నేతలు ఆహ్వానించారు. దీంతో హస్తం పార్టీలోకి తుమ్మల వెళ్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించి పార్టీ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న బాలసాని కూడా తన రాజకీయ గురువు తుమ్మల బాటలో నడుస్తారా అనే చర్చ గోదావరి తీర ప్రాంత మండలాల్లో జరుగుతోంది.

జో అచ్యుతానంద..



స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

- రామాలయంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహ హవనం

భద్రాచలం: 'లాలిజో కృష్ణా.. లాలిజో.. జో అచ్యుతానంద.. జోజో ముకుందా..' అంటూ ఆస్థాన పండితులు ఆలపించిన లాలలు జోలలతో శ్రీకృష్ణావతారంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి పరమానందభరితుడయ్యాడు. బేడా మండపంలో ఊయలలో వేంచేసియున్న స్వామివారిని చూసి భక్తులు పరవశించిపోయారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో గురువారం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఆలయంలో వేడుకలు జరిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారిని శ్రీ కృష్ణావతారంలో అలంకరించి మేళతాళాలు, భక్తుల నామస్మరణల నడుమ పల్లకీలో తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. సాయంత్రం దర్బార్ సేవ నిర్వహించిన అనంతరం స్వామివారిని ఊయలలో పరుండబెట్టి ఊంజల్ సేవ జరిపించగా.. ఆస్థాన విద్వాంసులు, పండితులు జోలలు.. లాలలు పాడారు. అంతకుముందు స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకం చేశారు. తొమ్మిది రకాల ప్రసాదాలను నివేదన చేశారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు కేఈ స్థలశాయి భాగవతంలోని శ్రీ కృష్ణ జనన ఘట్టాన్ని భక్తులకు వివరించారు.



స్వామివారికి కుంభ హారతి ఇస్తున్న అర్చకులు

వేడుకల్లో భాగంగా శుక్రవారం దేవస్థానం ఆధ్వర్యంలో ఉట్ల పండుగ నిర్వహించనున్నారు. కాగా, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీమద్భాగవత సప్తాహం కొనసాగుతోంది. చిత్రకూట మండపంలో అర్చకులు, వేద పండితులు శ్రీమద్భాగవత పారాయణం, ప్రవచనాలను భక్తులకు వినిపించారు.

కనులపండువగా నిత్యకలాణం..

ఆలయ ప్రాంగణంలోని ప్రాకార మండపంలో స్వామివారి నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూల మూర్తులకు అంతరాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రాకార మండపంలో స్వామివారిని ఆశీనులను చేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తుల గోత్ర నామాలను స్వామివారికి విన్నవించారు.

ఇది రాచరికం కాదు.. ప్రజాస్వామ్యం

ఎమ్మెల్సీ తాతా మధు



మాట్లాడుతున్న మధు, పక్కన ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వనని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొన్నాళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలు అహంకారంతో చేసినవేనని బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది రాజుల కాలం కాదు, ప్రజాస్వామ్యం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కాగా, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీనియర్ నాయకుడని, ఆయన విషయంలో తానేమీ వ్యాఖ్యానించనని అన్నారు. సీఎం కేసీఆర్ ఆయనకు ఎలాంటి గౌరవం ఇచ్చారో అందరికీ తెలుసన్నారు. సీఎం కేసీఆర్ స్థాయిలోనే ఆయనతో చర్చిస్తున్నట్లు తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన నేపథ్యాన ఆయనను మరోసారి గెలిపించాలని కోరారు. నాలుగున్నర ఏళ్లలో ఎమ్మెల్యేగా రూ.200 కోట్ల నిధులు తీసుకురావడంతో పాటు 100 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, అన్ని మండలాల్లో సెంట్రల్ డివైడర్లు, లైటింగ్ మంజూరు చేయించారని తెలిపారు. తొలుత నాగేశ్వరరావును ఎమ్మెల్సీ మధు సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రాంగణాల్లో' పాట్లు !

- సమస్యలకు నిలయంగా క్రీడా మైదానాలు
- కిట్లు కేటాయించినా నిరుపయోగమే..
- జిల్లాలో 730 క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- సౌకర్యాలు కల్పించాలంటున్న యువత



చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న క్రీడా కిట్లు



పెనగడప-మూలుగుగూడెంలో గ్రామానికి 3 కి.మీ. దూరంలో పైపులు అమర్చిన క్రీడాప్రాంగణం

చుంచుపల్లి: యువత, విద్యార్థులు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు సరైన వసతుల్లేక వెలవెలబోతున్నాయి. ఈ మైదానాలను ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్మించకపోగా, సరైన వసతులు కూడా లేక చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. జిల్లాలో అనేక చోట్ల నామ్‌కే వాస్తే అన్నట్టుగా క్రీడా ప్రాంగణాలు నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సగానికిపైగా క్రీడా ప్రాంగణాల్లో లోటుపాట్లు కనిపిస్తున్నాయి. అనేక చోట్ల చెత్త, గడ్డి, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. మరికొన్ని చోట్ల ఈ మైదానాలు గ్రామాలకు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో యువత, విద్యార్థులు, క్రీడాకారులు వాటిని ఉపయోగించేందుకు ఆసక్తి చూపడం లేదు. నివాసాలకు దూరంగా నిర్మానుష్య ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో అటు వైపు వెళ్లేందుకు మహిళా క్రీడాకారులు, బాలికలు భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు సాధారణ ప్రజలు కూడా అంతదూరం వెళ్లలేకపోతున్నారు. ఇక ప్రతీ క్రీడా ప్రాంగణంలో ఆటలు ఆడేందుకు స్పోర్ట్స్ కిట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలకు క్రీడా సామగ్రి సరఫరా చేసింది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే వీటి పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు.

నిధుల్లేక సతమతం..

ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతీ ఊరికి తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో భాగంగా ప్రతిచోటా భూమిని చదును చేయడంతో పాటు మైదానంలో రాళ్లుంటే తొలగించాలి. ప్లే గ్రౌండ్‌లో షాట్‌పుట్, లాంగ్‌జంప్, సింగిల్‌బార్, డబుల్‌బార్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులతో పాటు వాకింగ్, రన్నింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఈజీఎస్ పథకంలో మంజూరు చేసిన రూ.2.50 లక్షల నుంచి రూ.4.50 లక్షలలోపు నిధులతో వీటన్నింటినీ సమకూర్చాలంటే అవి ఏ మూలకూ సరిపోలేదు. దీంతో పనులు చేపట్టిన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు చాలాచోట్ల మైదానాలు చదును చేసి నేమ్ బోర్డులు, సింగిల్ బార్, డబుల్‌బార్ పైపులను ఏర్పాటు చేసి అలాగే వదిలేశారు. క్రీడా మైదానాల్లో కనీసం విద్యుత్ దీపాలు, నీటి వసతి లేవు. దీంతో ఈ ప్రాంగణాలను వినియోగించేవారు లేక పిచ్చిమొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించినా ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు చొరవ తీసుకుని వసతులు కల్పిస్తే యువతకు ప్రయోజనకరంగా మారనున్నాయి.

730 ప్రాంగణాలకు కిట్లు..

జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో 681, నాలుగు మున్సిపాలిటీల్లోని 49.. మొత్తం 730 క్రీడా ప్రాంగణాలకు కిట్లు కేటాయించారు. వీటిని మండల కేంద్రాలు, మున్సిపాలిటీలకు సరఫరా చేయగా, త్వరలోనే గ్రామ పంచాయతీలకు తరలించనున్నారు. స్థానికంగా ఉండే క్రీడాకారులతో కమిటీ వేసి కిట్లు అందజేస్తారు. ఇందులో ముఖ్యంగా జిమ్ పరికరాలతో పాటు క్రికెట్, వాలీబాల్ ఆటలకు సంబంధించిన సామగ్రి ఉంది. క్రికెట్‌కు సంబంధించి కశ్మీర్ విల్లో నంబర్ 5 బ్యాట్ ఒకటి, ఫుల్‌సైజ్ కశ్మీర్ బ్యాట్ ఒకటి, బ్యాటింగ్ గ్లౌసులు 2 జతలు, వికెట్ కీపింగ్ గ్లౌసులు ఒక జత, బ్యాటింగ్ లెగ్ ప్యాడ్లు 2 జతలు, వికెట్ కీపింగ్ లెగ్ గార్డు ఒక జత, వికెట్లు రెండు జతలు, క్రికెట్ బంతులు ఆరు, క్రికెట్ ఆర్మ్ గార్డ్‌లు 2, క్రికెట్ తిగ్ ప్యాడ్లు నాలుగు, క్రికెట్ కిట్ బ్యాగు ఒకటి ఉండగా, వాలీబాల్‌కు సంబంధించి సింథటిక్ బాల్స్ నాలుగు, నెట్లు 2, ఒక సైకిల్ పంపు ఉన్నాయి. జిమ్ పరికరాల్లో డంబెల్స్ (2.5 కిలోలు, 5 కిలోలు, 7.5 కిలోలు) మూడు సెట్లు, మెసరింగ్ టేప్ ఒకటి, డిస్కస్ త్రో 1, 2 కిలోలు, టెన్నీకాయిట్ రింగ్స్ ఆరు, స్కిప్పింగ్ తాళ్లు నాలుగు, విజిల్స్ మూడు, స్టాప్‌వాచ్ ఒకటి, కిట్ బ్యాగు ఒకటి, క్రీడాకారులకు 75 టీషర్టులు ఉన్నాయి.

క్లుప్తంగా

11 నుంచి నిరవధిక సమ్మె



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ

ఇల్లెందు: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం చెల్లించాలని, 10 లక్షల గ్రాట్యూటీ, పింఛన్, ఈఎస్ఐ, బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ తెలిపారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం పలు దఫాలుగా వినతి పత్రాలు అందజేసినా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. సీఐటీయూ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ ఎస్ఏ నబీ, చాట్ల రాంబాబు, కల్లెపల్లి మరియ, ఫాతిమా, అరుణ, సుజాత, శ్రీలత, రేణుక, సావిత్రీ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత



యువతికి బ్రాస్‌లెట్ ఇస్తున్న సీఐ రమేష్

కొత్తగూడెంటౌన్: ఆటోలో ప్రయాణించిన ఓ యువతి బంగారు బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకోగా ఆ ఆభరణాన్ని ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. టూ ఇంక్లైన్‌కు చెందిన సగ్గు మల్లీశ్వరి కూతురు సరయు రెడ్డి గురువారం రామవరం నుంచి కొత్తగూడెం పోస్టాఫీస్‌కు ఆటోలో ప్రయాణించిన సమయంలో బ్రాస్‌లెట్ పోగొట్టుకుంది. ఇంటికి వెళ్లాకా ఆటోలో బ్రాస్‌లెట్‌ను గుర్తించిన ఆటో డ్రైవర్ సంపంగి సాంబ టూటౌన్ సీఐ రమేష్‌కు అప్పగించారు. సీఐ యువతి కుటుంబీకులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి బ్రాస్‌లెట్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ ఆటో డ్రైవర్ సాంబను అభినందించారు.

టేకు కలప స్వాధీనం



ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న వాహనం

భద్రాచలంటౌన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద గురువారం తనిఖీలు చేపట్టిన అటవీశాఖ సిబ్బంది టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. జగదల్‌పూర్ నుంచి పాల్వంచ 124 టేకు ముక్కలను తరలించేందుకు అనుమతి ఉండగా, అంతకు మించి ట్రాలీలో తరలిస్తున్నారని ఫారెస్ట్ టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రసాద్ తెలిపారు. వాహనాన్ని పట్టుకున్నామని, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

బంగారం చోరీ

భద్రాచలంఅర్బన్: కూనవరం రోడ్డులోని ముదిరాజ్ బజార్‌లో గురువారం చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ముదిరాజ్ బజార్‌కు చెందిన మణికంఠ ఇంటి నుంచి పట్టణంలో తాను నిర్వహించే లాడ్జీ వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి రూ. 2లక్షల విలువైన 8 తులాల బంగారం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

బోనకల్: ఓ వివాహితపై అత్యాచారయత్నం జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మోటమర్రికి చెందిన వివాహిత గురువారం పొలం వద్ద పని చేస్తుండగా, గ్రామానికే చెందిన కిరణ్ అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడు. అనంతరం బాధిత మహిళ తన భర్తతో కలిసి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా రెండు కుటుంబాల నడుమ పొలాలకు సంబంధించి గొడవలు ఉన్న నేపథ్యాన ఈ ఘటన జరిగి ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం

ఏన్కూరు: ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదైంది. మండలంలోని గార్లఒడ్డు గ్రామానికి చెందిన గుగులోతు వెంకటేష్(32) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన తరచుగా భార్య అరుణతో గొడవపడేవాడు. గతనెల 8న కూడా భార్యతో గొడవపడిన వెంకటేష్ ఆటోతో తీసుకుని వెళ్లిపోయాడు. ఇప్పటివరకు తిరిగి రాకపోవడం, ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13.026

ఎడాపెడా చలాన్లు!

- ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలతో భయాందోళన
- జిల్లా కేంద్రంలో వణికిపోతున్న వాహనదారులు
- పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయని మున్సిపల్ అధికారులు
- రోడ్లపై పార్కింగ్‌కు చేస్తే జరిమానా విధిస్తున్న పోలీసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో వాహనదారులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయాందోళన చెందుతున్నారు. అసలే పెట్రోల్ రేట్లు మండిపోతుంటే దానికి తోడు చలాన్ల మోతమోగుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో ఐదు పోలీసు స్టేషన్ల సిబ్బంది తనిఖీల పేరుతో చలాన్లు విధిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్ర వేళలో ఒక స్టేషన్ కాకపోతే మరో స్టేషన్ పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. చుంచుపల్లి పోలీసుస్టేషన్, వన్‌టౌన్, త్రీటౌన్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్, లక్ష్మీదేవిపల్లి పోలీసుస్టేషన్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ చలాన్లు విధిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. పోలీస్ అధికారుల కంటే వారి డ్రైవర్లు అత్యుత్సాహం చూపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పని చేసే ఓ డ్రైవర్ ఇబ్బంది పెడుతున్నాడని, అతనిపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దుకాణాల ముందు పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలికానీ, ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని పేర్కొంటున్నారు.

పార్కింగ్ జోన్ ఏర్పాటెప్పుడో..?

కొత్తగూడెం జిల్లా కేంద్రమైన తర్వాత పట్టణంలో భారీగా వాహనాల సంఖ్య పెరిగింది. అందుకు తగ్గట్టుగా జిల్లా కేంద్రంలో పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయలేదు. చుంచుపల్లి మండలం మొదలుకొని ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు కూడా ఎక్కడా పార్కింగ్ జోన్ లేకపోవడంతో షాపింగ్‌కు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించామని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో పార్కింగ్ జోన్‌కు స్థలం లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఇరుశాఖల మధ్య వాహనదారులు నలిగిపోతున్నారు. ఏళ్ల తరబడి చలాన్లతో విసిగిపోతున్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

కొత్తగూడెం పట్టణ పరిధిలోని చిన్నబజార్, పెద్ద బజార్లు వ్యాపార వీధులుగా ఉన్నాయి. ఆ రెండు బజార్లలో కూడా ఇతర ప్రాంతాల నుంచి భారీ వాహనాలు సామగ్రి అన్‌లోడ్ చేయడానికి వస్తుంటాయి. గతంలో ఆయా వాహనాలు రద్దీ లేని సమయాల్లో బజార్లలోనికి వచ్చి అన్‌లోడ్ చేసి వెళ్లాలనే నిబంధన ఉండేది. ప్రస్తుతం ఆ నిబంధనలు ఉల్లఘించి భారీ వాహనాలు చిన్నబజార్, పెద్దబజార్లలోనికి రావడంవల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆయా బజార్లలోనికి వెళ్లిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు బయటకు రావడానికి 20 నిమిషాలపైనే పడుతోంది. భారీ వాహనాలను నిర్దేశిత వేళల్లోనే అనుమతించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పని చేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉదయం, సాయంత్ర వేళలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గతేడాది ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ప్రస్తుతం పని చేయడం లేదు. దీనివల్ల ప్రధానంగా పోస్టాఫీసు సెంటర్, బస్టాండ్ సెంటర్‌లలో తరచుగా చిన్న, చిన్న రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడంవల్ల కొందరు వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలేదు. దీంతో రద్దీ కూడళ్లలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నళ్లను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులేవి..?

రోడ్డు విస్తరణ పనుల వద్ద ప్రమాదాలు



డివైడర్ కోసం తీసిన గుంతలో పడిన బొలెరో వాహనం

సుజాతనగర్: కొత్తగూడెం–ఖమ్మం ప్రధాన రహదారి విస్తరణ పనుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు గోధుమవాగు నుంచి సుజాతనగర్ వరకు రెండు వైపులా బీటీ నిర్మాణం దాదాపు పూర్తయింది. డివైడర్ నిర్మాణం కోసం సుమారు కిలోమీటర్ మేర రహదారి మధ్యలో రెండు అడుగుల లోతులో గుంత తవ్వారు. గురువారం రాత్రి వర్షం రావడం, రోడ్డుపై చీకటి ఉండటంతో రెండు కార్లు అదుపు తప్పి ఒక్కసారిగా గుంతలో పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. స్థానికులు, పోలీసులు వాహనాలను గుంతలో నుంచి తీశారు. గుంతలో పడిన రెండు కార్లు మరమ్మతులకు గురయ్యాయి. కాగా హెచ్చరిక బోర్డులు, రేడియం లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'ఆమె'కు అభయం!



ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో పరీక్షల కోసం వచ్చిన మహిళలు

- 'ఆరోగ్య మహిళ'లో పరీక్షలు, చికిత్స
- ఖమ్మం జిల్లాలోని ఆరు సెంటర్లలో పరీక్షలు, ఆపై జిల్లా ఆస్పత్రికి...
- కొత్తగా ఇంకో ఏడు సెంటర్లకు అనుమతి
- అవసరమైన వారిని హైదరాబాద్‌కు రిఫర్

ఖమ్మం వైద్యవిభాగం: 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న పలు రకాల వ్యాధులను రూపుమాపేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది మార్చి 8న అందుబాటులోకి తీసుకురాగా, ఖమ్మం జిల్లాలో తొలి విడతగా ఆరు పీహెచ్‌సీలకు అనుమతి ఇచ్చారు. అక్కడ నిత్యం మహిళలకు ప్రత్యేక వైద్యం అందిస్తూ, సమస్య తీవ్రత ఉన్న వారిని ఖమ్మం జిల్లా ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)కు రిఫర్ చేస్తున్నారు. ఈమేరకు ఎంసీహెచ్‌లో ప్రతీ మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ కూడా వైద్యం అందుబాటులో లేకపోతే హైదరాబాద్ పంపిస్తున్నారు.

రెండు వేలు దాటిన రిఫరల్ కేసులు

పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి ఆరు సెంటర్ల ద్వారా రిఫర్ చేసిన మహిళలను ప్రతీ మంగళవారం వైద్యులు పరీక్షిస్తారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభమైన ఆరు నెలల్లో 2,010 మంది మహిళలను పెద్దాస్పత్రికి రిఫర్ చేశారు. వీరిలో ఇప్పటి వరకు 1,859 మందికి వైద్య సేవలు అందించగా మరో 151 మందికి చికిత్స చేయాల్సి ఉంది. ఈకార్యక్రమం ద్వారా థైరాయిడ్, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్, పోషకాహార లోపం, రక్తహీనత, మూత్రకోశం, నెలసరి వంటి సమస్యలకు చికిత్స అందుతోంది. ప్రస్తుతం మహిళల్లో ఆందోళన కలిగిస్తున్న కేన్సర్‌ను తొలి దశలోనే నియంత్రించేందుకు కృషి చేస్తున్నారు. పెద్దాస్పత్రిలో రిఫరల్ కేసులతో పాటు సాధారణంగా వచ్చే మహిళలకు కూడా మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని వర్తింపజేస్తున్నారు. ఇలా 2.970 మంది మహిళలు వైద్యసేవలు పొందారు. ఇక 30 కేన్సర్ కేసులను హైదరాబాద్ ఎంఎంజేకి రిఫర్ చేశారు.

మరో ఏడు సెంటర్లకు అనుమతి

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని తొలి విడతగా జిల్లాలోని ఆరు కేంద్రాల్లో మాత్రమే ప్రారంభించారు. ఎం.వెంకటాయపాలెం, మంచుకొండ, కామేపల్లి, వైరా, చెన్నూరు, బోనకల్ పీహెచ్‌సీల్లో మహిళలకు చికిత్స చేస్తూ మందులు అందజేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ప్రతిరోజు వైద్యసేవలందిస్తూ అనారోగ్య సమస్యలు ఉన్న మహిళలను పరీక్షల కోసం ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేస్తుంటారు. ఆయా పీహెచ్‌సీల నుండి వచ్చిన వారిని ప్రతీ మంగళవారం స్కానింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వ్యాధి తీవ్రత ఆధారంగా చికిత్స ఆరంభిస్తారు. వీరిలో అత్యవసరమైన వారిని హైదరాబాద్ పంపిస్తారు. కాగా, ప్రైవేట్‌లో ఖర్చుతో కూడుకున్న వైద్యం ఉచితంగా లభిస్తుండటంతో ఎక్కువ మంది మహిళలు ఆయా సెంటర్లకు వస్తున్నారు. తాజాగా ప్రభుత్వం జిల్లాలోని లంకాసాగర్, ముదిగొండ, నేలకొండపల్లి, సుబ్లేడ్, వేంసూర్ పీహెచ్‌సీలతో పాటు ఖమ్మం పాత మున్సిపాలిటీ, తపాలగూడెం(మేదర బస్తీ) సెంటర్లకు సైతం అనుమతి ఇచ్చింది. త్వరలోనే ఈ కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన సంభాని



ఉత్తమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న చంద్రశేఖర్

సత్తుపల్లి: తెలంగాణ కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన గృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన సంభాని ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్‌లో కొత్త సబ్‌డివిజన్లు..

- పాల్వంచ, మణుగూరు–2, క్వాలిటీ కంట్రోల్ విభాగం మంజూరు
- పెరగనున్న డీఈ, ఏఈ, ఇతర సిబ్బంది పోస్టులు
- ఈ నెల 12లోగా కొత్త కార్యాలయాలు ప్రారంభం



కొత్తగూడెంలో ఉన్న పంచాయతీరాజ్ శాఖ జిల్లా కార్యాలయం

పాల్వంచరూరల్: పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీరాజ్‌శాఖ(పీఆర్)ను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరిస్తోంది. జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లు ఉండగా, వీటి పరిధిలో ఐదు సబ్ డివిజన్లు ఉన్నాయి. కొత్తగా పాల్వంచ, మణుగూరు–2, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. డివిజన్ల పరిధిలో మండలాల విస్తీర్ణం అధికంగా ఉండటంతో కొత్త సబ్‌డివిజన్లను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్తగూడెం పంచాయతీరాజ్‌శాఖ డివిజన్ పరిధిలో ప్రస్తుతం అశ్వారావుపేట, ములకలపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం సబ్ డివిజన్లు ఉన్నాయి. కొత్తగా పాల్వంచ సబ్ డివిజన్‌తోపాటు క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ మంజూరైంది. పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాలతో కూడిన పాల్వంచ సబ్ డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాలయం పాల్వంచ పట్టణంలోని పాతఆర్డీఓ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలో బూర్గంపాడు, మణుగూరు సబ్ డివిజన్లు, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ ఉన్నాయి. తాజాగా ఈ డివిజన్‌లో పరిధిలో మణుగూరు–2 సబ్ డివిజన్ మంజూరైంది. ఈ సబ్ డివిజన్ పరిధిలో పినపాక తదితర ప్రాంతాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

పెరగనున్న పోస్టులు

పంచాయతీరాజ్‌శాఖలో జిల్లాలో మూడు సబ్ డివిజన్లు మంజూరు కావడంతో పరిపాలన కోసం పోస్టులు పెరగనున్నాయి. ఒక్కో సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈ, ఇద్దరు/ముగ్గురు ఏఈలు, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు కేటాయించనున్నారు. దీంతో జిల్లాలో డీఈ పోస్టులు మూడు, ఏఈ పోస్టులు 6 నుంచి 9 వరకు, మూడు సీనియర్ అసిస్టెంట్లు, మూడు అటెండర్ పోస్టులు భర్తీ చేయనున్నారు.

కొత్త సబ్ డివిజన్లు ప్రారంభిస్తాం

పంచాయతీరాజ్‌శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం మూడు సబ్ డివిజన్లు మంజూరు చేసింది. క్వాలిటీ కంట్రోల్‌ను కార్యాలయాన్ని కొత్తగూడెంలో, పాల్వంచ సబ్ డివిజన్ కార్యాలయాన్ని పాల్వంచ పాత ఆర్డీఓ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేస్తున్నాం.మణుగూరు–2 సబ్ డివిజన్ కార్యాలయం మణుగూరు లేదా భద్రాచలంలో ఏర్పాటు చేస్తాం. ఈ నెల 9 నుంచి 12వ తేదీలోగా కొత్త కార్యాలయాలు ప్రారంభిస్తాం.

–ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ

ఎరియర్స్ ఒకే దఫా చెల్లించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



దీక్ష చేపట్టిన ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల బకాయిలు ఒకే దఫా చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల కష్టార్జితాన్ని దోచుకునేందుకే ప్రభుత్వం ఎరియర్స్ చెల్లింపుల్లో జాప్యం చేస్తోందని విమర్శించారు. ఇందుకు సింగరేణి యాజమాన్యం, టీబీజీకేఎస్ సహకరిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణికి విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన కోట్ల రూపాయలను వసూలు చేయాలన్నారు. పైరవీలకే పరిమితమైన టీబీజీకేఎస్ కార్మికుల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. అందుకే గుర్తింపు సంఘం ఎన్నికలంటే కేసీఆర్‌కు భయం పట్టుకుందని, కాలపరిమితి తీరినా ఎన్నికలు నిర్వహించడంలేదని ఆరోపించారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని కోరారు. యూనియన్ నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, గనిగళ్ల వీరస్వామి, వి.మల్లికార్జున్‌రావు, ఎస్.రమణమూర్తి, జె.గట్టయ్య, హుమాయిన్, సందెబోయిన శ్రీనివాస్, గుమ్మడి వీరయ్య , తిరుపతి, ఏసుపాదం, అనంతలక్ష్మి, క్రిష్టాఫర్, రాము, నాగయ్య, సుబ్బారావు, రాజేశ్వరరావు, జడల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ : ముగ్గురికి గాయాలు

పాల్వంచరూరల్: యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల వద్ద బీసీఎం జాతీయ రహదారిపై ఆటో యూ టర్న్ తీసుకుంటోంది. ఈ క్రమంలో బీసీఎం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ ధనుంజయ్యతోపాటు ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హైటెక్ దొంగల గుట్టురట్టు

- సాంకేతిక లోపాల సాయంతో ఏటీఎంల నుంచి నగదు స్వాహా
- యూపీ, హరియాణాకు చెందిన ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం వన్ టౌన్ సీఐ స్వామి

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లాలోని పలు బ్యాంకుల ఏటీఎంల నుంచి నగదు స్వాహా చేస్తున్న యూపీ, హరియాణా రాష్ట్రాలకు చెందిన ముగ్గురు ముఠా సభ్యులను ఖమ్మం వన్ టౌన్, సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వన్ టౌన్ సీఐ స్వామి గురువారం వెల్లడించారు. హరియాణ రాష్ట్రం తహశీల్‌మేవు జిల్లాకు చెందిన వారిస్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని హమీర్‌పూర్ తహసీల్‌కు చెందిన నిషాద్ రాధేశ్యాం, నిషాద్ సంజయ్ ముఠాగా ఏర్పడ్డారు. వీరి తమ ప్రాంతంలోని వ్యక్తుల పేర్లతో బ్యాంకు ఖాతాలను తెరుస్తారు. అనంతరం ఆయా ఖాతాల్లో నగదు జమ చేసి, వారి నుంచి ఏటీఎం కార్డులు తీసుకుంటారు. ఆతర్వాత ఇతర రాష్ట్రాలకు బయలుదేరుతారు.

ఇలా చోరీలకు పాల్పడుతారు...

ఈ ముఠా సభ్యులు దూర రాష్ట్రాలకు వెళ్లి నిర్మానుష్య ప్రాంతాల్లో, సెక్యూరిటీ గార్డులు లేని ఏటీఎంలను ఎంచుకుంటారు. ఏటీఎం ద్వారా డబ్బు డ్రా చేసే క్రమాన నగదు సగం బయటకు రాగానే ఆపడం, ఆ నగదు తీసుకున్నాక ఖాతాల్లో డబ్బు తగ్గినా మెసేజ్ మాత్రం 'ట్రాన్సాక్షన్ ఫెయిల్'గా ఎలా వస్తుందో వీరికి అవగాహన ఉంది. దీంతో ఈ మార్గాన్ని ఎంచుకుని డబ్బు తీసుకుని మళ్లీ కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేస్తారు. ఫలితంగా కొన్నాళ్లకు మళ్లీ ఖాతాలో నగదు జమ అవుతోంది. ఇలా వచ్చిన సొమ్మును వీరు ముగ్గురు వాటాలుగా పంచుకుంటారు. గత రెండు నెలల్లో ఖమ్మం జిల్లాలోని పలు ఏటీఎంల్లో ఇదే తరహా జరిగిన నేపథ్యాన పోలీసులు నిఘా వేశారు. ఖమ్మం స్టేషన్‌రోడ్డులో ఉన్న స్తంభాద్రి బ్యాంక్ వద్ద ఏటీఎంకు గురువారం వచ్చిన ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా వ్యవహారం బయటపడింది. వీరి నుంచి 34 ఏటీఎం కార్డులు, రూ.15వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గోశాలకు గోవుల తరలింపు



పోలీసులు పట్టుకున్న పశువులు

భద్రాచలంఅర్బన్/పాల్వంచ: ట్రాలీ వాహనా ల్లో అక్రమంగా తరలిస్తున్న గోవులను పోలీసులు పట్టుకుని గురువారం పాల్వంచలోని గోశాలలో అప్పగించారు. చర్ల నుంచి మోరంపల్లి తరలిస్తున్న నాలుగు పశువులను, చర్ల నుంచి కారేపల్లి సంతకు తరలిస్తున్న మూడు పశువులను భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీఎన్ రావు తెలిపారు. ఏపీ సరిహద్దు ఎటపాక పోలీసులు మరో 11 పశువులను పట్టుకున్నారు. వీటిని సంరక్షణ నిమిత్తం పాల్వంచ గోశాలలో అప్పగించారని అన్నపూర్ణ గో సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయ శర్మ తెలిపారు.


మొర్రేడు వాగులో పడి వృద్ధుడి మృతి



ధర్మయ్య(ఫైల్)

పాల్వంచ: ప్రమాదవశాత్తు మొర్రేడు వాగులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బంగారుజాల గ్రామానికి చెందిన బాడిశ ధర్మయ్య(95) ఆరోగ్యం బాగోలేక పోవడంతో పాత పాల్వంచ వైద్యుని దగ్గరకు వచ్చి మందులు తీసుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో కాలు జారి మొర్రేడులో పడి కొంత దూరం కొట్టుకుపోయాడు. అటుగా వెళుతున్న కూలీలు గుర్తించి బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య సుక్కమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. గురువారం నివాస గృహంలో మృతదేహాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జమ్ముల సీతారామి రెడ్డి, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు సందర్శించి నివాళులు అర్పించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మధిర: గూడ్స్ రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి(30) ఆత్మహత్యకు పాల్పడ్డా డు. మధిర జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ ఎస్. వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించిన వివరాలు... మధిర–మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడి సదరు వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 99636 41484 నంబర్‌లో సంప్రదించాలని వేణుగోపాల్‌రెడ్డి సూచించారు.

క్లుప్తంగా...



మార్గదర్శి దందాపై విచారించాలి

హైకోర్టుకు నివేదించిన సీఐడీ.. అప్పీళ్లు దాఖలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీ, శైలజా కిరణ్ తదితరులపై నమోదు చేసిన కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ సీఐడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు, కేసును విచారణకు స్వీకరించేలా ఆ కోర్టులను ఆదేశించాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ ఈ అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

ప్రజలందరికీ.. 'ఆరోగ్య సురక్ష'

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: ఏపీ ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ద్వారా చికిత్సలు, మందులను ఉచితంగా అందించబోతోంది. ఎవరైనా రోగులకు అవసరమైతే ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్య చికిత్సలు చేయించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

చెప్పింది చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. ఇతరత్రా సేకరించిన వారి గుర్తింపు కార్డులతో వ్యవహారం నడుపుతోంది. వారి సంతకాలను ఫోర్జరీ చేస్తూ తీవ్ర నేరానికి పాల్పడుతోంది.

- ఘోస్ట్ చందాదారుల పేరిట చెక్‌లు జారీ చేస్తున్నప్పటికీ, ఆ చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం వారి వద్దే అట్టిపెట్టుకుంటోంది. ఆ చెక్కుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదు. బ్యాంకులో జమ చేయడం లేదు. ఇదో అతి పెద్ద ఆర్థిక మోసం. అలాంటి 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల్లో వంద మందిని సీఐడీ విచారిస్తోంది.
- దాంతో బెంబేలెత్తిన మార్గదర్శి యాజమాన్యం ఆ ఘోస్ట్ చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని, తర్వాత తాము అన్నీ సెటిల్ చేస్తామని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ తన పీఏ శశికళ ద్వారా చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.

అక్రమ డిపాజిట్లుగా నల్లధనం

- రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే తిరిగి బుకాయిస్తోంది. రాబోయే నెలలకు చిట్టీ గ్రూపులకు చెల్లించాల్సిన చందాలను అడ్వాన్స్‌గా జమ చేస్తున్నారని వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ అసలు చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే చందాదారుల పేరిట నాలుగైదు నెలల ముందే డిపాజిట్లు సేకరించిన విషయాన్ని సీఐడీ గుర్తించింది.
- చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే ఎవరైనా చందాల మొత్తం చెల్లిస్తారా? ఎవరూ చెల్లించరు కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే. రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు దాదాపు 2 వేల మందిలో రూ.కోటికి పైగా విలువైన అక్రమ డిపాజిట్లు చేసిన, చిట్టీ గ్రూపుల్లో చందాదారులుగా ఉన్న వారు ఏకంగా 800 మందికిపైగా ఉన్నారు. చాలా కంపెనీల పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు.



- ఆ 800 మందికిపైగా డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. అంత భారీగా డిపాజిట్లు ఎలా చేశారు.. ఆ నిధులు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయనే కోణంలో విచారిస్తోంది. విజయవాడలో ఓ బిల్డర్ ఏకంగా రూ.50 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా ఉన్నారు.
- ఇలాంటి భారీ మొత్తాల డిపాజిట్‌దారులు, చిట్టీ గ్రూపుల్లో సభ్యుల గురించి ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా సీఐడీ సమాచారమిచ్చింది. అక్రమ డిపాజిట్ల ముసుగులో నల్లధనం చెలామణిలోకి తీసుకువస్తున్నారా అన్నది సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సిన అవసరం ఉందని భావిస్తోంది.

ఏజెంట్లకూ కుచ్చుటోపి

- మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ చందాదారులు, ఏజెంట్లను కూడా మోసగిస్తోంది. కుట్ర పూరితంగా వారిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారి ఆస్తులు రాయించుకుంటోంది. దీనిపై చందాదారులు, ఏజెంట్లు, ఘోస్ట్ చందాదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి తగిన ఆధారాలు ఉన్న వాటిపై సీఐడీ కేసులు నమోదు చేస్తోంది.
- విజయవాడలో కోళ్ల ఫారం యజమాని బొండు అన్నపూర్ణా దేవి అనే మహిళను ఏకంగా 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్పించి ఆమెను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కుట్ర పూరితంగా విజయవాడలోని లబ్బీపేట, గుడివాడ మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాలు కేంద్రంగా ఈ మోసానికి పాల్పడ్డారు. విదేశాల్లో ఉన్న ఆమె కుమార్తె ప్రియాంక సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు. ష్యూరిటీలు ఇచ్చినా సరే కొర్రీలు వేస్తూ ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి ఆస్తులు కూడా రాయించుకున్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. ఆమె రూ.14 కోట్ల విలువైన 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా ఉన్నారు. ఆమె రూ.8 కోట్లు చందా మొత్తం చెల్లించారు. కానీ చిట్టీ పాట పాడితే ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.48 లక్షలు మాత్రమే. ఇందులో రూ.8 కోట్ల విలువైన 45 చిట్టీ గ్రూపుల్లో ఆమె రూ.1.7 కోట్లు చందా మొత్తంగా చెల్లిస్తే.. చిట్టీ పాట పాడిన తర్వాత ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.8 వేలు. ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి కుటుంబ ఆస్తులు కూడా రాయించుకుంటున్నారు.
- విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన పిలక లలిత కుమారి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఆమెను విశాఖపట్నంలోని డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఘోస్ట్ చందాదారుగా చేర్చారు. ఆ విషయం తెలిసి ఆమె చిట్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అక్కడ ఉన్న పత్రాల్లో ఉన్న సంతకాలు చూసి అవి తాను చేయలేదని ఫోర్జరీ చేశారని తెలిపారు.
- ఆమె చిట్టీ పాడినట్టు.. ఆమెకు చిట్టీ మొత్తం చెల్లించినట్టు కూడా రికార్డుల్లో ఉంది. అందుకు ఇద్దరు సాక్షి సంతకాలు కూడా చేశారు. తనకు తెలియకుండానే తనను చందాదారుగా చేర్చడంతోపాటు తన సంతకాలు ఫోర్జరీ చేయడంపై లలిత కుమారి విశాఖపట్నం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో విశాఖపట్నం డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్ యలమంచిలి బాబూ రాజేంద్ర ప్రసాద్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏజెంట్ కె.సంతోష్, సాక్షి సంతకాలు చేసిన జి.నరసింగరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్, ఎండీ శైలజా కిరణ్, ఆమె పీఏ శశికళ, విజయవాడ లబ్బీపేట బ్రాంచి మేనేజర్ బండారు శ్రీనివాసరావు, గుడివాడ బ్రాంచి మేనేజర్ వైవీవీడీ ప్రసాద్, పాతూరి రాజాజీ, పాపి నాయుడులను నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.
- పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఏజెంట్‌నే ఆ సంస్థ మోసం చేసింది. ఏజెంట్ సంతకాన్ని బ్రాంచి మేనేజర్ ఫోర్జరీ చేశారు. ఏజంట్ ఫిర్యాదుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

రూ.9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్

కేంద్ర చిట్ ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడిన రాజమహేంద్రవరానికి చెందిన జగజ్జనని చిట్ ఫండ్స్‌కు చెందిన రూ.9,43,52,020 విలువైన స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. వాటిలో భవనాలు, భూములు, ఖాళీ స్థలాలతో కూడిన మొత్తం 12 స్థిరాస్తులను అటాచ్ చేయనుంది. చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఐడీ ప్రతిపాదనకు హోమ్ శాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై న్యాయస్థానం ఆమోదం కోసం సీఐడీ పిటిషన్ దాఖలు చేయనుంది. న్యాయస్థానం అనుమతి అనంతరం ఆ ఆస్తులను అటాచ్ చేస్తుంది.

మా కుటుంబాన్ని దోచేసి రోడ్డున పడేశారు

- బోరున విలపించిన బొండు అన్నపూర్ణా దేవి

'మార్గదర్శి చిట్ ఫండ్స్ మమ్మల్ని పూర్తిగా మోసం చేసి ఆర్థికంగా కుదేలయ్యేట్టు చేసింది. మా కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మా ఆస్తులు, బంగారం, వృద్ధాప్యంలో అవసరాల కోసం దాచుకున్న మొత్తం అంతా మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు ధారపోశాం. అయినా సరే ఇంకా మమ్మల్ని వేధిస్తూ మిగిలిన ఉన్న ఇంటిని కూడా తీసుకునేందుకు వేధిస్తోంది. మా కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి మోసానికి పాల్పడింది. నా భర్త ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడు. నేను కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాను. నేను మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరాను. ఆ తర్వాత ఏకంగా 65 గ్రూపుల్లో నన్ను చందాదారుగా చేర్పించింది. నిబంధనల ప్రకారం మేము ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఉద్దేశ పూర్వకంగా మమ్మల్ని 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించింది. మా ఆస్తు లు తీసుకుంది. నా భర్త జీపీఎఫ్ డబ్బులు కట్టి, పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించాం. అయినా సరే ఇంకా బకాయి ఉన్నారంటూ మా ఇల్లు వేలం వేయించారు. మా ఇంటికి వచ్చి అల్లరి చేశారు. మా అమ్మాయి విదేశాల్లో వైద్య విద్య చదువుతోంది. ఆమె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించా రు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మమ్మల్ని వేధిస్తున్నారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది? ఎలా వేలం పాటలో పాల్గొంది? తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది? ఇంత దారుణంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ మమ్మల్ని మోసం చేసింది. మమ్మల్ని కుట్ర పూరితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిన మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం, మేనేజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.'

ఆలస్యంగా ఆశ్రయించడం సమర్థనీయం కాదు

నీట్ పరీక్ష రాసిన విద్యార్థిని తప్పుబట్టిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్యలో 'స్థానిక'సీట్ల భర్తీకి సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును రిజర్వు చేశామని, ఇప్పుడు మరో పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇంత ఆలస్యంగా కోర్టును ఆశ్రయించడాన్ని సమర్థించలేమని స్పష్టం చేసింది. వైద్యవిద్య సీట్ల భర్తీ అనేది కాలపరిమితితో కూడిందని, ఇప్పటికే రెండుసార్లు కౌన్సెలింగ్ కూడా ముగిసిందని చెప్పింది. ఆగస్టు 2వ తేదీనే నాన్ లోకల్‌గా పేర్కొన్నా 31వ తేదీ వరకు పిటిషనర్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని తప్పుబట్టింది. పిటిషన్‌ను కొట్టివేసింది. ఇంటర్మీడియట్ స్థానికంగా చదవకుంటే నీట్‌లో లోకల్ కోటా (85 శాతం) కిందికి రారంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 114ను సవాల్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లెకు చెందిన విద్యార్థి శ్రీస్వరాజ్ రవీందర్ నాగపుర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోకల్‌గా పరిగణించకుంటే కేవలం 15 శాతం సీట్లలోనే తాము పోటీపడాల్సి ఉంటుందని, ఇది చట్టవిరుద్ధమ ని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయ మూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం న్యాయసూత్రాల మేరకు కొన్నిసార్లు ఆలస్యం అనేది న్యాయాన్ని పొందకుండా చేస్తుందని వ్యాఖ్యానించింది. ఇలాంటివారి హక్కుల పరిరక్షణకు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

12న వడ్డెర ప్రతినిధుల మహాసభ

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం వస్తే వడ్డెర కులస్తులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉద్యమంలో ముందుండి పోరాడితే ఉమ్మడి ఏపీలో ఉన్న హక్కులు కూడా ప్రత్యేక రాష్ట్రంలో లేకుండా చేస్తూ అధఃపాతాళానికి తొక్కేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. వడ్డెరల సమస్యలు చర్చించేందుకు ఈ నెల 12న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో వడ్డెర సంఘం ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభ పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, అధ్యక్షుడు ద్యారంగుల నగేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరాత్రి దుర్గయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల జనాభా ఉన్న వడ్డెర కులస్తులకు బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు కనీసం 4 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వడ్డెర పిల్లలకు గురుకులాల్లో ఎంట్రెన్స్ లేకుండా సీట్లు ఇవ్వాలన్నారు. మహాసభకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐలయ్య, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లి గుడి షాపులకు 13న వేలం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం సమీపాన నిర్మించిన కాంప్లెక్స్‌లో షాపులు కేటాయించేందుకు ఈనెల 13న వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కాంప్లెక్స్‌లోని 11షాపులను మూడేళ్లపాటు అద్దెకు ఇవ్వనుండగా, కొబ్బరి చిప్పలు, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలను ఏడాదిపాటు పోగు చేసుకునే హక్కు కల్పించేందుకు వేలం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 13న బుధవారం ఉదయం వరకు రూ.200 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సీహెచ్‌పీల్లో సింగరేణి డైరెక్టర్ తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, జేవీఆర్ ఓసీల్లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల(సీహెచ్‌పీ)ను సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీల్లో బొగ్గు రవాణా విషయాలపై ఆరాతీశారు. అనంతరం కొత్తగూడెం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. బొగ్గు నాణ్యత ఏ మాత్రం తగ్గకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని, ఎక్కడ కూడా ఉత్పత్తి, రవాణాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు నవీన్‌కుమార్, వై.రఘురామి రెడ్డి, కే.వీ.రావు, ఎం.కమలాకర్, దుర్గాప్రసాద్, విశ్వేశ్వరరావు, సోమశేఖర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు అడ్తిదారులకు లైసెన్సులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా గుర్తించిన అడ్తిదారులకు శుక్రవారం లైసెన్సులు అందించనున్నారు. మార్కెట్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వారికి లైసెన్సులు అందించనున్నారని మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత తెలిపారు. కాగా, మొత్తం 420 మంది దరఖాస్తు చేసుకోగా, 150 మందికి లైసెన్సులు ఇవ్వాలని నిర్ణయించారు.

కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభంజనమే

- తెలంగాణలోనూ అధికారంలోకి వస్తున్నాం..
- మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

కల్లూరురూరల్/ఖమ్మం మామిళ్లగూడెం: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించి, మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. కల్లూరు మండలంలోని నారాయణపురంలో గురువారం మేరీ మిట్టీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణపురంతో పాటు ఖమ్మంలోని బీజేపీ జిల్లా కార్యాలయాల్లో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కాక తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కాగా, జాతీయ సమైక్యత, సమగ్రతలను దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న మేరీ మిట్టి, మేరా దేశ్ కార్యక్రమం ద్వారా పవిత్ర ప్రాంతాలు, ఇతర చోట్ల నుంచి సేకరిస్తున్న మట్టిని 7,500 కలశాలల్లో ఢిల్లీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఇక ఈనెల 17న సేవా పక్వాడా పేరుతో 18 కులవృత్తుల వారికి సాయం అందించనున్నట్లు సుధాకర్‌రెడ్డి వెల్లడించారు.



నారాయణపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు

రెడ్డిపల్లిలో పర్యటన

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య ఇంట్లో మట్టి సేకరించి మారెమ్మతల్లి ఆలయంలో పూజలు చేయించారు. ఈసమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావుతో పాటు నాయకులు నకిరికంటి వీరభద్రం, పుల్లయ్య, మంద సరస్వతి, అల్లిక అంజయ్య, సుగుణ, నెల్లూరి కోటేశ్వరావు, యాకూబ్‌పాషా, దీకొండ శ్యాం, శివాజీ, పొంగులేటి మహేందర్‌రెడ్డి, గుమ్మా రామకృష్ణ, గుండపనేని అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ, కేసీఆర్ విధానాలపై పోరాడతాం

ఖమ్మంమయూరిసెంటర్: నూతన ఆర్థిక విధానాలు ఫలితంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యాన... ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ఆర్థిక విధానాలపై పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తెలిపారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. మరోసారి బీజేపీ ప్రభుత్వం వస్తే మతాల మధ్య చిచ్చుపెట్టి అల్లకల్లోలం సృష్టించడం ఖాయమని తెలిపారు. హిందుత్వం పేరిట మత రాజకీయాలు చేస్తూ హిందువులపై ఆర్థిక భారం మోపడం ఏమిటని ప్రశ్నించారు. ఇక తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, భుక్యా శ్రీనివాసరావు, యర్రా గోపి, బండారు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న సుదర్శన్

దడ పుట్టిస్తున్న డెంగీ కేసులు

రఘునాథపాలెం: జిల్లాలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొద్దిరోజులుగా డెంగీ కేసులు నమోదవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో గ్రామాల్లోని నీటి నిల్వల్లో దోమల పెరిగి డెంగీ కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో బుధవారం ఇద్దరు డెంగీ బారిన పడకుండగా గురువారం పువ్వాడనగర్‌లో ఒకరికి డెంగీ నిర్ధారణ అయినట్లు తెలిసింది. దీంతో వైద్యులు సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి పరీక్షలు చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

సింగరేణి గనులను సందర్శించిన ఢిల్లీ బృందం

సత్తుపల్లిరూరల్/మణుగూరు రూరల్: సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీతో పాటు మణుగూరు సింగరేణి ఏరియాను న్యూఢిల్లీకి చెందిన ఐఆర్‌టీఎస్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ పాఠక్ గురువారం సందర్శించారు. చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్) సుదర్శన్‌రెడ్డి, సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మేనేజ్‌మెంట్) డాక్టర్ జె.ఆల్విన్‌తో కలిసి వచ్చిన ఆయన బంకర్ల ద్వారా రోజువారీగా బొగ్గు రవాణా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బొగ్గు రవాణా, నిల్వ, బెల్ట్‌ల నిర్వహణను పరిశీలించారు. ఇక మణుగూరులో బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా కోసం రైల్వే ట్రాక్ పురోగతిపై చర్చించారు. కాగా, ఢిల్లీ బృందాన్ని సింగరేణి కొత్తగూడెం, మణుగూరు ఏరియాల జీఎంలు షాలేం రాజు, దుర్గం రాంచందర్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో రైల్వే, సింగరేణి అధికారులు సురేందర్, నర్సింహారావు, సుందర్‌రాజు, మోషక్, ప్రదీప్‌కుమార్, రవి, సురేష్, మదన్ నాయక్, డి.శ్రీనివాస్, నిరంజన్, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఓసీలోని సైలో బంకర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిరూరల్: ఖమ్మం జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం కురిసిన వర్షంతో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ పనులకు అంతరాయం ఏర్పడింది. రెండు ఓసీల్లో 1.90లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు, 36వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో పటిష్ట నిఘా



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ, ఏపీ పోలీసు అధికారులు

సన్నాహక సమావేశంలో అంతర్ రాష్ట్ర పోలీసుల నిర్ణయం

పెనుబల్లి/అశ్వారావుపేటరూరల్: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యాన నిఘా పటిష్టం చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యాన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఏపీ, తెలంగాణలోని పోలీస్ అధికారులు పెనుబల్లి, అశ్వారావుపేటలో సమావేశం కాగా, కల్లూరు ఏసీపీ బి.రామానుజం, పాల్వంచ డీఎస్పీ ఎస్.వెంకటేష్ మాట్లాడారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి సరిహద్దుగా ఉన్న ఏపీలోని పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు. నిఘాను పటిష్టం చేయడం, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తుతోపాటు ఇతర అంశాలపై ఉమ్మడిగా చర్చించినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా భద్రతాపరంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, నూజివీడు డీఎస్పీలు ఎం.ధనుంజయ్, అశోక్‌కుమార్, నూజివీడు రూరల్, చింతలపూడి, జీలుగుమిల్లి, భద్రాద్రి జిల్లా పాల్వంచ, అశ్వారావుపేట, సత్తుపల్లి, కల్లూరు సీఐలు ఆర్.అంకబాబు, ఎం.మల్లేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వి.వినయ్‌కుమార్, టి.కరుణాకర్, జె.మోహన్‌బాబు, సీహెచ్.హానోక్, అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ కె.నాగయ్య, ఎస్సైలు జి.సూరజ్, పి.శ్రీకాంత్, శివరామకృష్ణ, సాయికిషోర్‌రెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత సంతకం 'మువ్వా'

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు సాహిత్య చరిత్రలో మువ్వా శ్రీనివాసరావు తన కవితలు, రచనలతో శాశ్వత సంతకం చేశారని సాహితీవేత్త టి.వి.పూర్ణచందర్‌రావు వెల్లడించారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో శ్రీనివాసరావు సాహిత్యంపై వెలువడిన 'అనితరుడు' వ్యాససంకలన పరిచయ సభ గురువారం ఏర్పాటుచేశారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ శ్రీనివాసరావు తనకు ఆత్మీయ శిష్యుడని, తాను ప్రారంభించిన 'దీపిక' పాఠశాల పత్రికలో మొదటి కవిత రాశాడని గుర్తు చేశారు. అనంతరం విద్యావేత్తలు రవిమారుత్, ఐ.వీ.రమణారావు మాట్లాడగా కీర్తి పురస్కార గ్రహీత, కథకుడు రాచమళ్ల ఉపేందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆట్లూరి వెంకటరమణ, కన్నెగంటి వెంకటయ్య, పొత్తూరి సీతారామారావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఉరిమళ్ల సునంద, నామా పురుషోత్తం, బుక్కా సత్యనారాయణ, రమేష్, సుభాషిణి, హవీల, జనార్దన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న పూర్ణచందర్‌రావు, తదితరులు

గంజాయి మత్తులో బాలుడిపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం ముస్తఫానగర్‌లో గంజాయి మత్తులో ఆకతాయిల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. దారి వెంట వెళ్తున్న ఓ బాలుడిపై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి స్నేహితులతో గురువారం ఆరుబయట ఆడుకుంటున్నాడు. ఆ ప్రాంతంలో గంజాయి తాగుతున్న పలువురు సదరు బాలుడిని పట్టుకుని అకారణంగా చితకబాదారు. దీంతో బాలుడి స్నేహితులు వెళ్లి ఆయన తండ్రికి చెప్పగా వచ్చి అడ్డుకోబోయిన ఆయనపై కూడా దాడి చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినందున పోలీసులు స్పందించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.